కథానిక

# "తిలోత్తమ"

పెరివిల్లి నరసింహం

ప్రపంచంలోని సౌందర్యోపాసకులలో నేనొకణ్ణి. ఏదైనా ఒక అందమైన వస్తువు కనిపిస్తే దాని వైపు నిముషాలకొద్దీ తదేకధ్యానంతో చూసేవాడిని. నడుస్తూ నడుస్తూ మధ్య ఆగిపోయేవాణ్ణి. రానురాను నా సౌందర్యోపాసన స్త్రీలవరకూ విస్తరించింది. అందమైన స్త్రీని చూచేటప్పుడు కూడా నా అనుభూతి- ఒక మంచి పండునిగాని ఒకసుందరమైన భవనాన్నిగాని చూస్తూన్నప్పుడు కలిగే అనుభూతిలాంటిదేకలిగేది. కాని అన్యథా స్వార్థభూయిష్టమైన కోరికలు నాలో కలిగేవి కావు. ఈ విషయంలో మిత్రులు నన్ను బాగా అపార్థం చేసుకొన్నారనే చెప్పాలి.

ఇటీవల సౌందర్యోపాసనతోబాటు నాలో సాహిత్యాభిలాష కూడ జనించింది. నేను కేవలము పాఠకుణ్ణి మాత్రమే! వీలైనంతవరకు పత్రికలు, గ్రంథాలు కొనుక్కొని చదివేవాడ్ని. శక్తి చాలనంతమేరకు యెరువు తెచ్చుకొనేవాడిని. మొత్తంమీద యేదోవిధంగా ప్రచురితమయ్యే ప్రతీ పుస్తకం చదివేవాడిని.

రచయితలు చాలామంది ఇంచుమించు ప్రతీ రచనలోనూ వారి శ్రీయుతుల్ని, ఊర్వశిల్ని పరిచయం చేస్తుండేవారు. కథకుల భార్యలందరూ చాలా అందమైనవారై ఉంటారనే నమ్మకం కుదిరింది.

రచయిత "క"గారి రచనలు చాలా చదివేను. "క"గారంటే నాకోవిధమైన గౌరవభావంకూడా ఏర్పడ్డది. "క"గారు రచనలో ప్రతీదానిలోనూ వారి శ్రీమతి తిలోత్తమగారి ప్రసక్తివచ్చేది. వారి శ్రీమతి పేరు వారు వ్యవహరిస్తున్నట్లు "తిలోత్తమో" లేక ఆవిడకు మరేదేనా పేరుండేదో నాకు తెలియదు.

తిలోత్తమగార్ని చూడకుండానే నాకు వారిగురించి ఒక వూహాజనిత రేఖాచిత్రం సాక్షాత్కరించేది. "క"గారి రచనలబట్టి ఆవిడ ఆకారం, రూపం ఈవిధంగా వుంటాయని నిశ్చయించుకున్నాను.

తిలోత్తమగారి పొడవు సుమారు 5'-8" ఉంటుంది. వారి పొడవును నిర్ణయించడానికి నాకు దొరికిన ఆధారాలివి-

"క"గారు ఒక కథలో తామాజాన బాహుణ్ణని ఒక సందర్భంలో పేర్కొన్నారు. దీనిని బట్టి "క"గారి పొడవు నిర్ణయించడానికి నాకట్టే కష్టమనిపించలేదు. ప్రపంచం మాట ఎలాగున్నా ఆంధ్రదేశంలో సుమారు 5'-10" మొదలు 6' లోపుగావుండి దానికితగ్గ ఒడ్డువున్న వాళ్లంతా ఆజానుబాహుల క్రిందే జమ. వేరే కథలో "తిలోత్తమ ఒయ్యారం ఒలకపోస్తూ కాఫీగ్లాసు పట్టుకొని నా ప్రక్కనే నిలబడ్డది. తిలోత్తమని చూస్తూంటే విధాత ఆమెను నాకొరకే సృష్టించాడా అనిపిస్తుంది. ఆమె పొడవు నా చెవుల వరకూ వుందని" వ్రాశారు. "క" గారి చెవుల దగ్గరనుండి శిరాగ్రహమువరకూ పొడవు 4" వుంటుంది. లేదా "క"గారు రచయిత కాబట్టి వారి ఖుర్ర సువిశాలమై చెవినుండి తలాగ్రమువరకూ 6" కూడా వుండొచ్చు. దీనిని వారి పొడవులోంచి తగ్గిస్తే తిలోత్తమగారి పొడవు వస్తుంది.

"క"గారే వేరొక సందర్భంలో తిలోత్తమగారి నడుం కొంచం సన్నంగా వుంటుందన్నారు. ఆమె ఛాతీ, వారి ఛాతీ కన్నకూడా కొంచం విశాలంగా వుంటుందని సగౌరవంగా చెప్పుకున్నారు. "క"గారు ఆజానుబాహువు గాబట్టి వారి ఛాతీ సుమారు '33" వుంటుంది. తిలోత్తమగారి ఛాతీ వారి ఛాతీకన్న కొంచం విశాలంగా వుంటుందని సందేహాస్పదంగా తేల్చేరు కాబట్టి వారిఛాతీ 33½"వరకూకూడ వుండవచ్చు. తిలోత్తమ చాల అందమైనవారు కాబట్టి వారి నడుంమరీ సన్నంగావుంటే బాగుండదనిపిం

చింది. వారి నడుము సుమారు 30” వరకూ ఉంటుంది.

“క”గారు ఒక్కొక్కప్పుడు ఏమీతోచక తిలోత్తమగారి నేత్రాలవైపు సూటిగా చూసే వారుట. తిలోత్తమగారికళ్లు ఈ విషయంవల్ల విశాలమైనవని రూఢియైంది.

ఒకసారి “క”గారు ఏదో ప్రణయ కలహంలో తిలోత్తమగారి దీర్ఘమైన జడపట్టుకునిలాగి వెంకి పిల్లా అని తనమునివేళ్ళతో ఆమెబుగ్గని మీటేరట. ఆ చిటికినవ్రేళ్ళస్పర్శకే ఆమెబుగ్గలు మరింత ఎర్రబారేయిట. “క” గారి హృదయం ఎంత నొచ్చుకుంది!

తిలోత్తమగారి చెక్కిళ్లు స్వతహాగా రాగి వర్ణం. కప్పు తప్పు గులాబీవర్ణందాల్చి వుంటాయి. ఆమెజటకూడా సుదీర్ఘమైనదని వారన్నారు కాబట్టిపొడవు ఒక గజమైనా వుండొచ్చు

“క”గారి తిలోత్తమ ఒకబాడీ వేసుకొని దానిమీద ఒకసన్నని జాకెట్టు వేసుకొనేవారట. పరికిణీమీద తరచు సిల్కుపైట వేసుకొనే వారట. అయితే నాకిక్కడ ఒక సందేహం వచ్చింది. సుమారు 5’–8”పొడవు వుండి, 33½” చాతీగలిగిన తిలోత్తమగార్కి పరికిణీ ఎందుకు కావల్సి వచ్చిందా అని. నా లెక్కలు ఎక్కడేనా పొరపాటేమోనని తీసిచేతలు అవీ మరో సారి చూచుకున్నా ఎక్కడా తేడాకనిపించలేదు. కాగా అదోతరహా అందంకాబోలనుకునేవాడిని. తిలోత్తమగారి వయస్సు 18 సంవత్సరాలు మాత్రమే! ఇంతక్కువ వయస్సులో అంత ఏపుగా ఎలా పెరిగిందా అని ఆశ్చర్యం వేసింది.

తిలోత్తమగారు రంగురంగుల వస్త్రాలు ధరించేవారు. ఆమె శరీరచ్ఛాయ మాత్రము తెల్లగా వుండివుండాలి. మిగతా విషయాల్లో ఆమె అవయవసౌష్టవం తీర్చిదిద్దినట్లుంటుందని దఫదఫాలుగా “క” గారే చెప్పొన్నారు. రవివర్మకూడా చిత్రించలేనట్టి సౌందర్యరాశిగా తిలోత్తమగారి వూహాచిత్రం నాలో ఏర్పడింది.

ప్రపంచంలోని సౌందర్యోపాసకులలో నే నొకణ్ణి అని ముందుగానే చెప్పేకాను. “క”గారి తిలోత్తమగార్ని చూడాలనే కోరిక నాలో స్వత హాగానే కలిగింది. “క”గారి చిరునామాఏనా తెలియనినేను “క”గారితో ఎలా పరిచయం చేసుకోగలను? తద్వారా తిలోత్తమగార్ని ఎలా చూడగలను?

* * *

ఓ శుభముహూర్తాన అనుకోని విచిత్రమైన సంఘటన జరిగింది. నేను, రామశర్మా ఊళ్లోని ఉక్కబాధ భరించలేక చెరువుగట్టుకు షికారు పోయి పెద్దతూముదగ్గర కూర్చొని పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నాం. అక్కడే “క”గారికీ నాకు పరిచయం కల్గింది.

మేము లోకాభిరామాయణం మాట్లాడు కొంటూ ఉంటే అపరిచితవ్యక్తి అలా షికారు పోతూ రామశర్మని ‘Wish’ చేసాడు. శర్మ అతన్ని వచ్చికూర్చోమన్నాడు. కాని ఆయన ఇంకా కొంతదూరం వెళ్ళి తిరిగివస్తానని, అంత వరకూ మమ్మల్ని అక్కడ కూర్చోమని తిరిగి వచ్చేక అందరమూ కలసి ఊళ్ళోకి పోవచ్చునని చెప్పి వెళ్ళిపోయాడు.

ఎవరన్నట్టు నేను రామశర్మవేపు చూశాను. “అతగా మాకోక్లర్కు. మొన్నే ఈ వూరు బదిలీఅయిం”దన్నాడు.

“పొగల్లా ఆఫీసులో పనిచేస్తాడు. వళ్ళంతా అలసిపోయి ఉంటుందిగదా ఈ నడిచిన మైలు చాలక మరింకెందుకు” అన్నాను.

“అదా. ఆయనో రచయిత. రోజూ వంటరిగా పోయి ఏకాంత ప్రదేశంలో ప్రశాంతంగా కూర్చొని తన కథనుగూర్చి ఆలోచించుకుంటూ ఉంటాడు.–“ఆయనో కథకుడనగానే ఆయన్ని గూర్చి పూర్తిగా తెలుసుకోవాలనే కోరిక కల్గింది.

“ఇంతకీ ఆయన పేరు?”

“పేరు జగ్గారావు.”

జగ్గారావనగానే నాలోని కుతూహలం చాలా వరకు చచ్చిందనే చెప్పాలి. పేరు కొంచెం మోటుగా వుంది. అయినా నేనింతవరకూ చదివిన ఏ పత్రికలోనూ కూడ “జగ్గారావు” అన్న పేరు చూడలేదు. ఆయన ఏదైనా మారుపేరుతో వ్యవ హరిస్తున్నాడేమో.

“క” అనే కలం పేరుతో వ్రాస్తున్నాడులే” అన్నాడు శర్మ.

నాకెందుకో శర్మ చెబుతున్నదంతా అబద్ధమని తోచింది. "క"గారు జగ్గారావేనంటే నాకాశ్చర్యమేసింది. "క"గారిగురించి నేను ఊహించుకొన్న చిత్రంవేరు. వారు ఆజానుబాహులు. జగ్గారావు మహావుంటే 5'-5" మించి ఉండడు. "క"గారి ఛాతీ అందంగా వుండి 33"కు మించి ఉండకూడదు. జగ్గారావు ఛాతీ 36"కు మించి ఉండి కాస్త స్థూలంగా కనిపిస్తోంది. ఈ "క" గారు మరో "క"గారేమో! శర్మ లోకం మరమ్మత్ మీద లంచగొండితనంమీద ఏదో దీర్ఘంగా చెప్పుకుపోతున్నాడు. నేను ఈ "క"గారు, "శృంగార సుందరి" కథ రచయితలు కాదా అవునా అని ఎటూ తేల్చుకోలేక సంధిగ్ధావస్థలో పడ్డాను.

సూర్యాస్తమయమై చాలా సేపయింది. రామశర్మ "నీ పరధ్యానాన్ని కట్టిపెట్టి లేరా"అని తట్టి లేపాడు. లేచి రోడ్డు ఎక్కాం. జగ్గారావు మాకోసరం నిలబడ్డాడు. శర్మ మా యిద్దరికి పరిచయం చేసాడు.

ముగ్గురమూ బయలుదేరాము. నేను అనుమాననివృత్తికోసం. "మీ శృంగార సుందరి చాలా బాగుంది"అన్నాను.

"ఆ దానికేముందిలెండి. నామీద అభిమానం కొద్దీ అలా అంటున్నారు. ఆ! ఏమన్నారూ! నేనేమీ వ్రాయలేదే. ఇంతకూ నేను వ్రాస్తానని మీకెవరు చెప్పారు?"

నేను రామశర్మ వేపు చూపెట్టేను. "క"గారికి తను రచయితని ఇతరులకు తెలియడం ఇష్టంలేనట్లు నటిస్తున్నారు.

"మీకు ఎలాగా తెలిసిపోయింది. కాబట్టి ఇంకా విషయం గురించి అంతగా పట్టించుకోనక్కర లేదు. కాని మీరుమాత్రం దయయుంచి నన్ను ఈ ఊళ్ళో ఎవరికీ పరిచెయ్యంచెయ్యకండి. ఈ రోజుల్లో సినిమా నటులు, రచయితలు ప్రజల మధ్య తిరగడం కష్టం"అన్నారు "క"గారు.

నాలో ఉత్సాహం మళ్ళీ పెల్లుబికింది.

"మీరు కథకులని తెలియడం మంచిదేకదండీ. సమాజంలో మీకు మంచి స్థానముంటుంది."

"పోనిద్దురూ. సమాజంలో స్థానమాట దేముడెరుగును. కాని పాఠకులు ఫలానా వ్యక్తి ఫలానా అని తెలియగానే రకరకాల ప్రశ్నలు వేస్తారు. కొందరు కథ యిలా ఉంటే బాగుండదా అని కంక్లూజను మార్చి తమ తెలివి ప్రకటించుకొందుకు చూస్తారు. కొందరు కథారచనకు నేర్పమంటారు."

"'విద్య పూర్తిగ నిచ్చినన్ పెరుగుబోదు' నన్నారు కదా అండి నేర్పితే మీకేం నష్టం?" అడిగాను.

"అసలు కళలు, సంగీతం, కవిత్వం ఇవి నేర్పడానికి సులువు అయినవి కావు. మనిషిలో పుట్టుకతో వస్తాయి కాదూపోదూ అంటే నాలాంటి వాళ్లెవళ్ళైనా మెరుగులు దిద్ది వెలుగులోకి తీసుకురావచ్చు."

"క"గారు చెప్పినమాట సత్యమనే నాకు తోచింది.

చిన్నప్పుడు నాకు సంగీతమంటే మంచి అభిలాష వుండేది. సినిమా రికార్డులు జోరుగా విని ఇంటికొచ్చి ఆలాపించుకొనే వాడిని. రానురాను నా లయజ్ఞానం వృద్ధిచెందుతున్నట్లే భావించుకొనేవాణ్ణి. కొంతవరకూ వరుసలు పట్టుపడినట్లే అనిపించేవి. ఉత్సాహంతో కొంచం స్థాయి హెచ్చించేసరికి ఓనాడు అన్నయ్య చదువుకున్న పుస్తకం నా ముఖంమీదకి నెట్టి "తగ్గించరా అపస్వరాలు. జంతువు లొస్తాయి" అన్నాడు. ఆ సాయంత్రం నేను వీధిలోకి పోతే మా యిరుగు ఆబాలగోపాలం కూడా నన్ను చూసి గుసగుసలాడుకొంటూ నవ్వుకున్నారు. ఆనాటినుంచి ఈనాటివరకూ పాటసరదాకేనా ఎత్తుకుంటేనట్టు.

తరువాత "క"గారు నేనూ చాలా చోట్ల కలుసుకొన్నాం. రానురాను మా పరిచయం వృద్ధి అయింది. శర్మ ఎప్పుడేనా రాలేకపోయినా నేనూ "క"గారూ షికార్లు వెళ్ళేవాళ్ళం.

"క"గారిని ఏదో ఒక మిషమీద మా ఇంటికి తరచు ఆహ్వానించేవాణ్ణి. రెస్పాంసుగా "క"గారు నన్ను ఒక్కసారి కూడా వారి యింటికి ఆహ్వానించే వారు కాదు.

ఆమాటా ఈమాటా ఆడుకుంటూ ఒక్కొక్కప్పుడు వారితోపాటు షికారు తరువాత వారి ఇంటివరకూ వెళ్లేవాణ్ణి. వారు మలుపుదగ్గర రోడ్డుమీదే నిలబడి మాట్లాడి "క్షమించాలి మాటల మధ్యను ఇంతదూరం వచ్చేశారు" అనేవారు.

నేను తిలోత్తమగారిని చూడ్డానికని చేసిన ప్రతీ ప్రయత్నం ఏదో విధంగా భగ్నమయేది. ఇంక వారిని చూడ్డం పడదేమోనని మనసు ఆందోళన చెందేది. అపజయాలు వస్తూన్నకొలదీ తిలోత్తమగారిని చూడాలనే కోరిక నాలో బలీయంగా గూడుకట్టుకొంది.

ఒకనాడు "క"గారి ఆహ్వానం లేకుండానే "క"గారి ఇంటికి ఉదయం ఎనిమిది గంటలకు వెళ్ళేను. "క"గారు పైనలేరు. అరుగుమీద రెండు మూడు కుర్చీలు ఒక పాత పత్రిక ఉన్నాయి. ఆ పత్రిక తీసి పేజీలు తిరగవేస్తున్నా. "క"గారు పైకి వస్తారేమోనని ఆలోచిస్తూ.

"ఏమండీ ఆవాలడబ్బాలో పావలా మీరేనా తీశారూ" లోపలనుండి ఒక కంఠం బొంగురుగా వినిపించింది. "ఆఁ! ఏమండీ" అన్న పదంలో ఆ కొద్దిపాటి దీనత్వం లేకపోతే అది ఒక మగవాడి గొంతుక క్రింద జమకట్టే దుర్గతి పట్టేది.

"మిమ్మల్నే మాట్లాడరేమండీ."

"నేనే తీశాను. కావుడూ! ప్రొద్దున్న కథ పత్రికకు పంపించడానికి చిల్లర లేకపోతే."

"ఆవాలడబ్బాలులోవి కొట్టేశారన్న మాట. కడుపు నిండనా, కాలునిండనా వెధవ కథలు. ఈ కాపురం చెయ్యలేను. మా పుట్టింటికి పంపించి వేయండి."

మాటామాటా పెరిగి వారి వాగ్యుద్ధం చిన్న అంతంకలహంగా మారింది. తిలోత్తమ సౌందర్యరాణి, సుగుణాలకుప్ప, శృంగారలక్ష్మి కదా, మరి పావలాకు ఇంత రభస ఎందుకు వచ్చిందా అని అనుమానంతో ద్వారంవేపు చూశాను.

తిలోత్తమ జుత్తు విరగబోసుకొని కాళికా దేవిలా గర్జిస్తూ పుట్టింటికి పోతానంటూ పైకి వచ్చింది. ఆవిడ ఆకారం చూడగానే నాకు చిరుచెమటలు పట్టేయి.

"ఈ ఒక్కసారి నా మర్యాదను కాపాడు కావుడూ" అంటూ "క"గారు కూడ పైకివచ్చి నన్ను చూసి నిశ్చేష్టుడై కొయ్యబారిపోయాడు. కావుడు సిగ్గుపడి లోపలికి వెళ్ళిపోయింది.

"క"గారు కావుడులోంచి అంత శృంగార రసోక్తి చేసేరంటే వెనకటికి కవి "తివిరి యిసుమున తైలంబు తీయవచ్చు"నన్న పద్యభాగంలో అతిశయోక్తి లేదనితోచింది.

* * *

ఈ సంఘటన ప్రభావం నామీద చాలా పని చేసింది. నాలో సౌందర్యోపాసన చాలావరకు సన్నగిల్లింది. జనబాహుళ్యంలో నాకున్న విశేషణము "లేడీహంటర్" అన్న పేరుకూడా ఇప్పుడిప్పుడే మాస్తున్నది. ఇందుకుగాను కృతజ్ఞత "క"గారికే చెప్పాలో లేక కావుడు పురఫు తిలోత్తమగారికే చెప్పాలో పాఠకులే నిర్ణయించాలి. మరో విలక్షణం: ఆనాటినుంచీ నాకు కథానికలు చదవాలనిపించటంలేదు.

---

ఆ యింట్లో ఒక పుట్టు గుడ్డివాడు వుండేవాడు. ఇంట్లో అందరూ పాపం గుడ్డివాడు అని యెంతో ఆదరాభిమానాలతో వాణ్ణి చూసేవారు. అయినా కూడా తనని యెవరూ సరిగ్గా చూడడంలేదనీ, తను గుడ్డివాడు కదా అని లోకువ చేస్తున్నారనీ అతను వాపోయేవాడు. ఇంట్లోవాళ్లు యేం చేసినా అతనికి తృప్తికలిగేది కాదు. అంతా నీళ్లు తాగితే అతనికి పాలు యిచ్చి, అంతా మజ్జిగ పోసుకొంటే అతనికి పెరుగు పోసీ అంతా ఒక ముద్దే తింటే, అతనికి కడుపునిండా పెట్టినా కూడా నన్ను సరిగ్గా చూడ్డంలేదని గొణిగేవాడు. ఓనాడు ప్రాణం విసిగి, వాడు యెంత తింటాడో చూద్దాం అని పూర్తిగా గొర్రెనంతా రుచిగా వండి అతని ముందు తినమని పెట్టేరు. గుడ్డివాడు దాని ముందు కూర్చుని వాసనచూసి చిరునవ్వు నవ్వుకున్నాడు. అది చూసి యింట్లోవాళ్లు హమ్మయ్య, అనుకోపోయే సమయంలో, గుడ్డివాడి ముఖ కవళికలు మారాయి. క్షణం ఆలోచించి విచారంగా అన్నాడు: "నాభాగానికే యింత గొర్రెమాంసం వస్తే, మీరెంతంత తిన్నారో?"—విలియం సారోయన్.